సాక్షి
కుమురం భీం
ఆదివారం । 5 । అక్టోబర్ । 2025





**అత్యవసర వైద్యం అందేనా!**
లింగాపూర్ పీహెచ్‌సీలో అత్యవసర సేవలు అందక మండల ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఆస్పత్రిలో 24 గంటలు సేవలు అందేలా చూడాలని కోరుతున్నారు. 9లో▸



**నిధులు లేక.. అభివృద్ధికి నోచక..**
కాగజ్‌నగర్ బల్దియా గత పాలకవర్గం ఆమోదించిన పనుల బిల్లులు పెండింగ్‌లోనే ఉన్నాయి. నిధులు విడుదల చేస్తామన్న ప్రభుత్వ హామీ అమలుకు నోచుకోలేదు. 9లో▸

**వాతావరణం**
గరిష్టం/కనిష్టం
29.0 /24.0
సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో అక్కడక్కడా వర్షం కురుస్తుంది.

## న్యూస్‌రీల్

### బాధ్యతల స్వీకరణ



సిబ్బందితో నరేశ్‌యాదవ్

ఆసిఫాబాద్: 102, 108 వాహనాల జిల్లా అధికారిగా మెరుగు నరేశ్‌యాదవ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం డీఎంహెచ్‌వో సీతారాంను మర్యాద పూర్వకంగా కలిశారు. నరేశ్‌యాదవ్ భూపాల్‌పల్లి జిల్లా నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ జిల్లా అధికారిగా పని చేస్తున్న సతీశ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు బదిలీ అయ్యారు.

### సమావేశం సక్సెస్ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పురుషోత్తం

రెబ్బెన: కాగజ్‌నగర్‌లోని వినయ్ గార్డెన్స్‌లో ఈనెల 5, 6వ తేదీల్లో నిర్వహించనున్న తెలంగాణ శ్రామిక మహిళా ఐదో రాష్ట్ర కన్వెన్షన్‌ను విజయవంతం చేయాలని డీవైఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు చాపిడి పురుషోత్తం కోరారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి శ్రామిక మహిళా ఉద్యమ నాయకులు, ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, ఆర్థిక, రాజకీయ, సామాజిక, ఉద్యోగ తదితర అంశాలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తారని పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 5న ఉదయం 11గంటలకు ఎస్పీఎం గ్రౌండ్ నుంచి రాజీవ్‌గాంధీ చౌరస్తా వరకు భారీ ప్రదర్శన ఉంటుందని తెలిపారు. అనంతరం బహిరంగ సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని మండలాల నుంచి అధికసంఖ్యలో శ్రామిక మహిళలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. జిల్లా కమిటీ సభ్యుడు చాపిడి శివ, గ్రామ కార్యదర్శి డోంగ్రి గజానంద్ పాల్గొన్నారు.

### నాసిరకం మందులు విక్రయిస్తే చర్యలు



షాపులో రికార్డులు పరిశీలిస్తున్న వెంకట్

రెబ్బెన: ఫర్టిలైజర్ షాపుల్లో నాసిరకం మందులు విక్రయిస్తే చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయాధికారి వెంకట్ హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంతోపాటు నారాయణపూర్‌లోని ఫర్టిలైజర్ షాపులు, నారాయణపూర్ రైతువేదికలో యూరియా పంపిణీని తనిఖీ చేశారు. షాపుల్లోని రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్ ఫర్టిలైజర్ షాపుల్లో ప్రభుత్వ ధరలకే ఎరువులు విక్రయించాలని సూచించారు. రైతులకు నకిలీ, నాసిరకం మందులు అంటగట్టినా, అధికధరలకు విక్రయించినా లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. విత్తనాలు, ఎరువుల కొనుగోలు సమయంలో రైతులు తప్పనిసరిగా రశీదులు పొందాలని సూచించారు. రైతులకు సరిపడా యూరియా సరఫరా అవుతోందని, మోతాదుకు మించి వాడితే భూసారం దెబ్బతింటుందని తెలిపారు. సేంద్రియ ఎరువుల వినియోగంపై దృష్టి సారించి అధిక దిగుబడులు పొందాలని సూచించారు. ఆయన వెంట ఏవో దిలీప్, ఏఈవోలు రాకేశ్, సంజీవ్, శివ తదితరులున్నారు.

# రణభూమిని మరిచారా?



గత జనవరిలో వేసిన శిలాఫలకం



జోడేఘాట్ గ్రామం

- అసౌకర్యాలకు నిలయం జోడేఘాట్!
- భీం మ్యూజియం అభివృద్ధి జాడేది?
- ఎండిపోతున్న హరితవనం మొక్కలు
- నీటి మూటలైన పాలకుల హామీలు

కెరమెరి: చరిత్ర పుటల్లోకెక్కిన ఆదివాసీ వీరుడు కుమురంభీం జల్.. జంగల్.. జమీన్.. కోసం ప్రాణ త్యాగం చేసిన ప్రాంతమైన జోడేఘాట్ అభివృద్ధికి నోచుకోవడం లేదు. కనీస సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. భీం వర్ధంతి సమీపిస్తుండడంతో సందర్శకుల తాకిడి క్రమంగా పెరుగుతోంది. ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా మహారాష్ట్రలోని చంద్రపూర్, రాజూరా, గడ్‌చందూర్ తదితర ప్రాంతాలకు చెందిన ఇక్కడికి వస్తున్నారు. అయితే.. సందర్శకులకు ఇక్కడా తాగునీరు కూడా లభించని దుస్థితి ఉంది. ఒక్కగానొక్క బోరు ఉండగా అది గ్రామస్తుల తాగునీటి అవసరాలకు సరిపోతోంది. దీంతో కనీస సౌకర్యాలు లేక ఇక్కడికి వచ్చే సందర్శకులు ఇబ్బందులు పడుతున్నారు.

> 'కుమురం భీం మ్యూజియం నిర్మాణానికి రూ.25 కోట్లు మంజూరు చేశాం. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారికి విశ్రాంతి కోసం కాటేజీలు, మంచి హోటల్ నిర్మిస్తాం. భవిష్యత్‌లో జోడేఘాట్ చారిత్రక ప్రదేశంగా మారుతుంది. పర్యాటకుల తాకిడి కూడా బాగా పెరుగుతుంది'
>
> – 7.10.2014న భీం వర్ధంతి సభలో అప్పటి సీఎం కేసీఆర్ అన్న మాటలివి.

**నెరవేరని కేసీఆర్ హామీ**
2014లో నిర్వహించిన భీం వర్ధంతి సభలో అప్పటి సీఎం కేసీఆర్ జోడేఘాట్‌లో రూ.25కోట్లతో కుమురం భీం విగ్రహంతో పాటు మ్యూజియం ఏర్పాటు చేస్తున్నామని, పెరుగుతున్న పర్యాటకుల సంఖ్యకు తగినట్లు కాటేజీలు, హోటళ్లు నిర్మిస్తామని ప్రకటించారు. పదకొండేళ్లయినా నేటికీ కార్యరూపం దాల్చలేదు. ఉమ్మడి జిల్లాలోని వివిధ పార్టీల ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి జోడేఘాట్ అభివృద్ధిని విస్మరించారనే ఆరోపణలున్నాయి.

**కాంగ్రెస్ సర్కారుదీ అదే తీరు**
అప్పటి ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ప్రస్తుత ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు జోడేఘాట్‌లో రూ.4.96 కోట్లతో టూరిజం అభివృద్ధి పనులకు ఈ ఏడాది జనవరి 13న శంకుస్థాపన చేశారు. మ్యూజియం వెనుక భాగంలోని స్థలంలో కాటేజీలు, హోటళ్లు నిర్మించనున్నట్లు ప్రకటించారు. తొమ్మిది నెలలైనా నేటికీ పనులు ప్రారంభించలేదు. 12 పోరు గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చినా నేటికీ కార్యరూపం దాల్చలేదు. పాలకుల హామీలు నీటి మూటలుగానే మిగిలాయి.

### ఎండిపోయిన మొక్కలు

గతంలో హరితవనంలో భాగంగా మ్యూజియం వెనుక భాగంలోని ఖాళీ స్థలంలో టూరిజం, అటవీశాఖ అధికారులు సుమారు 29వేల మొక్కలు నాటారు. మనిషి ఆకృతిని నిర్మించి అవయవాల వద్ద 100రకాల ఔషధ మొక్కలు నాటి వదిలేశారు. ఏ అవయవానికి అవసరమయ్యే మొక్కలను వాటి వద్దే నాటగా అవి నీరు లేక ఎండిపోయాయి. ప్రస్తుతం లోటస్‌పాండ్‌లోని మనిషి ఆకృతిలో ఔషధ మొక్కల స్థానంలో పిచ్చి మొక్కలు దర్శనమిస్తున్నాయి. గతేడాది ఉపాధిహామీ పథకంలో నాటిన కొన్ని మొక్కలు మాత్రమే కనిపిస్తున్నాయి. హరితవనంలో భాగంగా నాటిన సుమారు 29వేల మొక్కల్లో ప్రస్తుతం రెండు వేల మొక్కలు కూడా కనిపించడం లేదు.



మనిషి ఆకృతి చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలు

### పనులు ప్రారంభించాలి



పాలకులు జోడేఘాట్ అభివృద్ధికి ఇచ్చిన హామీలు అమలు చేయాలి. పర్యాటకుల కోసం కాటేజీలు నిర్మించాలి. ఐటీడీఏ ఆధ్వర్యంలో హోటళ్లు ఏర్పాటు చేయాలి. ఎండిన మొక్కల స్థానంలో మళ్లీ మొక్కలు నాటించాలి. మొక్కల సంరక్షణకు నీటి సౌకర్యం కల్పించి ఓ కూలీని నియమించాలి. పాలకులు, అధికారులు స్పందించి వెంటనే పనులు ప్రారంభించాలి.

– పెందోర్ రాజేశ్వర్, పోరు గ్రామాల అధ్యక్షుడు

# 'పాలఘోరీ'పై ప్రత్యేక నిఘా

- అక్కడే తిష్టవేసిన అటవీ సిబ్బంది
- సంఘటన పునరావృతం కాకుండా చర్యలు



పాలఘోరీ ప్రాంతంలో అమర్చిన సీసీ కెమెరాలు

జన్నారం: అటవీశాఖ అధికారులకు కంటిమీద కునుకు లేకుండా చేసిన పాలఘోరీ ఘటన మళ్లీ పునరావృత్తం కాకుండా ఉండేందుకు ఆశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. రెండేళ్ల క్రితం కూడా ఇలాంటి సమస్య ఏర్పడటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఏ క్షణంలోనైనా ఆదివాసీ గిరిజనులు గుడిసెలు వేసుకునే అవకాశం ఉండడంతో అటవీశాఖ అధికారులు అదే ప్రాంతంలో తిష్ట వేశారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిఘా పెంచారు.

**గుడిసెలు తొలగింపు**
జన్నారం అటవీ డివిజన్, ఇందన్‌పల్లి రేంజ్ కవ్వాల్ అటవీ సెక్షన్, సోనాపూర్ తండా బీట్ పాలఘోరీ ప్రాంతంలో జరిగిన సంఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్, జైనూర్, లింగాపూర్ మండలాలకు చెందిన సుమారు వందమంది ఆదివాసీ గిరిజనులు ఆగస్టు 4న ఈ ప్రాంతంలో తాత్కాలికంగా గుడిసెలు వేసుకుని ఆవాసం ఏర్పాటు చేసుకున్నారు. అటవీ, పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులు వారికి పలుసార్లు కౌన్సిలింగ్ ఇచ్చి ఆప్రాంతాన్ని ఖాళీ చేయాలని సూచించారు. కానీ, వారు వెళ్లకపోగా సెప్టెంబర్ 18న రాత్రి సుమారు 350 టేకుచెట్లను నరికారు. అడ్డుగా వెళ్లిన అటవీశాఖ అధికారులపై దాడులకు పాల్పడ్డారు. దీంతో 26 మందిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల సహాయంతో అడవిలో వేసుకున్న గుడిసెలను తొలగించారు.

**ప్రత్యేక నిఘా**
గుడిసెలు తొలగించిన తర్వాత మళ్లీ ఎప్పుడైనా ఆదివాసీ గిరిజనులు తిరిగి ఆ ప్రాంతానికి వచ్చే అవకాశం ఉందని జిల్లా అటవీశాఖ అధికారి శివ్ ఆశిష్ సింగ్ పది రోజులపాటు అక్కడే ఉండాలని టాస్క్‌ఫోర్స్ అధికారులను ఆదేశించారు. జన్నారం అటవీ డివిజనల్ అధికారి రామ్మోహన్ ఇందన్‌పల్లి, జన్నారం, తాళ్లపేట్ అటవీ రేంజ్‌లలోని సిబ్బందికి రోజువారీగా డ్యూటీలు వేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఒక టీం, మధ్యాహ్నం నుంచి సాయంత్రం 7 గంటల వరకు మరో టీం, సాయంత్రం 7గంటల నుంచి తెల్లవారుజాము వరకు మరో టీంను ఏర్పాటు చేసి నిఘా పెట్టారు. వీరితో పాటుగా ఇందన్‌పల్లి రేంజ్ అధికారి శ్రీకాంతచారి, టాస్క్‌ఫోర్స్ రేంజ్ అధికారి శ్రీనివాస్ పర్యవేక్షణ చేస్తున్నారు. అంతేకాకుండా పాలఘోరీ ప్రాంతంలోని అటవీ సిబ్బందిలో మార్పులు చేశారు. డీఆర్వో, సెక్షన్ అధికారి, బీట్ అధికారులను నూతనంగా నియమించారు. ఇక్కడి బేస్‌క్యాంపు సిబ్బందిని మరోచోటకు పంపించి కొత్తవారిని నియమించారు. విధుల్లో చిన్న నిర్లక్ష్యం ప్రదర్శించినా వేటు తప్పదని సంకేతాలు ఇవ్వడంతో కిందిస్థాయి సిబ్బంది భయంతో విధులు నిర్వర్తిస్తున్నట్లు తెలుస్తోంది.

**కందకాల తవ్వకం**
పాలఘోరీ ప్రాంతంలో విలువైన టేకు చెట్లు నరికివేతకు గురి కావడాన్ని సీరియస్‌గా తీసుకున్న అటవీ అధికారులు ఆ ప్రాంత పరిసరాల్లో చుట్టూ కందకాలను తవ్వించారు. అక్కడ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పర్యవేక్షణ బాధ్యతలను సిబ్బందికి అప్పగించారు. అయితే టైగర్‌జోన్ సర్కిల్, జిల్లా అటవీశాఖ, జన్నారం డివిజన్ శాఖ నుంచి పాలఘోరీపై నిఘా ఉన్నట్లు తెలుస్తోంది.

### నిఘా ఉంచాం



పాలఘోరీ ప్రాంతంలో కొందరు ఆదివాసీ గిరిజనులు అక్రమంగా వేసుకున్న గుడిసెలు తొలగించాం. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఆ ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ప్రత్యేక నిఘా ఉంచాం. సిబ్బందికి ప్రత్యేక డ్యూటీలు వేశాం. అటవీ భూమిలో అక్రమంగా గుడిసెలు వేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

– రామ్మోహన్, ఎఫ్‌డీవో, జన్నారం

## రేపటి ప్రజావాణి రద్దు

ఆసిఫాబాద్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించనున్న ప్రజావాణిని రద్దు చేసినట్లు కలెక్టర్ వెంకటేశ్ దోత్రే శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సాధారణ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు. అర్జీదారులు గమనించి సహకరించాలని సూచించారు.

# దసరా జోష్

- జిల్లాలో జోరుగా మద్యం విక్రయాలు
- ఆర్టీసీకి కూడా భారీగా ఆదాయం
- కిటకిటలాడిన మార్కెట్లు, దుకాణాలు




ఆసిఫాబాద్: దసరా పండుగను పురస్కరించుకుని జిల్లాలో వ్యాపారాలు జోరుగా సాగాయి. వివిధ దుకాణాలు కొనుగోలు దారులతో కళకళలాడాయి. పెద్ద ఎత్తున మద్యం అమ్మకాలు జరిగాయి. కిరాణా, పండ్లు, పూలు, మాంసం దుకాణాలు కొనుగోలుదారులతో రద్దీగా కనిపించాయి. బంగారు ఆభరణాల దుకాణాలు సందడిగా మారాయి. జిల్లా కేంద్రం నుంచి హైదరాబాద్‌కు ప్రత్యేక బస్సులు నడపడంతో ఆర్టీసీకి రోజువారీ ఆదాయం పెరిగింది.

**జోరుగా మద్యం అమ్మకాలు**
దసరా సందర్భంగా జిల్లాలో మద్యం అమ్మకాలు ఊపందుకున్నాయి. గత నెల 28నుంచి ఈ నెల ఒకటి వరకు జిల్లాలోని 32మద్యం దుకాణాల్లో రూ.5.47 కోట్ల విలువైన 7,098 ఐఎంఎల్ కేసులు, 3,203 బీర్ల కేసులు అమ్ముడుపోయాయి. డిమాండ్‌ను ఊహించిన వైన్స్ యజమానులు ముందుగానే సరిపడా స్టాక్ అందుబాటులో ఉంచారు.

**వ్యాపారులకు లాభాలు**
ప్రధానంగా మద్యం, మాంసం విక్రయాలతో పాటు షాపింగ్ మాల్స్, ఎలక్ట్రానిక్ దుకాణాలు ఇతర వ్యాపార సముదాయాలు కొనుగోలుదారులతో సందడిగా మారాయి. బతుకమ్మ సందర్భంగా పండ్లు, పూల వ్యాపారాలు జోరుగా సాగాయి. జిల్లా వ్యాప్తంగా సుమారు 100కు పైగా మాంసం దుకాణాల్లో సుమారు రూ.కోటికి పైగా అమ్మకాలు జరిగినట్లు తెలుస్తోంది. మొత్తంగా బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా బిజినెస్ బాగా జరిగి వ్యాపారులకు లాభాలు వచ్చాయి.

**ఆర్టీసీకి సమకూరిన ఆదాయం**
దసరా సెలవులు ప్రారంభం కావడంతో విద్యార్థులు ఇంటిబాట పట్టారు. జిల్లాకు చెందిన వందలాది మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు సొంతూళ్లకు తరలివచ్చారు. వ్యాపారులు, ఉద్యోగాలు, ఉపాధి నిమిత్తం వివిధ ప్రాంతాల్లో ఉంటున్నవారంతా సొంతూళ్లకు చేరుకున్నారు. ఈ క్రమంలో గత నెల 25నుంచి జిల్లా కేంద్రం నుంచి హైదరాబాద్‌కు ప్రత్యేక బస్సులు వేశారు. కాగజ్‌నగర్, మంచిర్యాల, ఆదిలాబాద్‌తో పాటు మహారాష్ట్రకు ప్రయాణికుల తాకిడి పెరిగింది. సాధారణంగా ఆసిఫాబాద్ డిపోకు నిత్యం సగటున రూ.16 లక్షల ఆదాయం సమకూరుతుండగా, దసరా సందర్భంగా అదనపు ఆదాయం వచ్చింది. గత నెల 26నుంచి ఈ నెల ఒకటో తేదీ వరకు రూ.1.78 కోట్ల ఆదాయం సమకూరినట్లు డిపో మేనేజర్ రాజశేఖర్ తెలిపారు.

# కాలువల ఆనవాళ్లేవి?



బర్రెలు సేద తీరుతున్న ఈ ప్రాంతం నీటిగుంట అనుకుంటే పొరపాటే. ఇది అడ ప్రాజెక్ట్ ప్రధాన ఎడమ కాలువకు ఉప కాలువ. కొన్నేళ్ల క్రితం సిమెంట్ లైనింగ్ కొట్టుకుపోయి ఇలా తయారైంది. సామేలా, కోమటిగూడ, దుబ్బగూడ, కనర్‌గాం గ్రామాల మీదుగా ఆసిఫాబాద్ మండలంలోని గుండా వరకు విస్తరించిన దీనికి పలు పిల్ల కాలువలున్నాయి. పలుచోట్ల కాలువకు గండ్లు పడి అటు వైపు ఆయకట్టుకు నీరు అందడం లేదు.



ఇది 39,500 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో నిర్మించిన అడ ప్రాజెక్ట్ ప్రధాన ఎడమ కాలువ. ఇటీవల కురిసిన వర్షాలకు చిన్నవాంకిడి సమీపంలో భారీ గండి పడి నీరు వాగులో కలుస్తోంది. దీంతో దిగువ ప్రాంతంలో నీటిబొట్టు లేకుండా ఎండిపోయింది. ఏళ్లుగా కాలువకు మరమ్మతులు చేపట్టకపోవడంతో సిమెంట్ లైనింగ్ కొట్టుకుపోయి పిచ్చి మొక్కలు, పూడికతో నిండి అధ్వానంగా, కళావిహీనంగా మారింది.



చిన్నవాంకిడి సమీపంలో తెగిన కాలువ బండ్

- నిండా పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం
- వరదనీటికి చిన్నవాంకిడి వద్ద గండి
- ఆయకట్టుకు సాగునీరు అందేదెలా?
- మరమ్మతులకు నోచుకునేదెప్పుడో!

వాంకిడి: సిమెంట్ లైనింగ్ కొట్టుకుపోయి పిచ్చి మొక్కలు, తుంగ, చెత్తాచెదారం, పూడికతో నిండిన అడ (కుమురంభీం) ప్రాజెక్ట్ ప్రధాన ఎడమ కాలువ అధ్వానంగా మారింది. అధికారుల నిర్వహణ లోపంతో సాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా తయారైంది. అడపాదడప చేపడుతున్న నాణ్యతలేని మరమ్మతు పనులతో తరచూ కాలువ తెగిపోతోంది. దీంతో చివరి ఆయకట్టుకు సాగునీరు అందక రైతులు ఇబ్బంది పడుతున్నారు. కాలువకు సమీపంలోని పొలాలకూ చుక్క నీరు అందించలేని పరిస్థితి ఏర్పడింది. మండలంలో సాగునీటికి ప్రధాన వనరుగా ఉన్నా ఈ ఎడమ కాలువ నిర్వహణ లోపంతో అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవడం లేదు.

**39,500 ఎకరాల ఆయకట్టు**
అడ ప్రాజెక్ట్‌ను 2011లో ప్రారంభించగా ప్రధాన ఎడమ కాలువను వాంకిడి మండలం గుండా నిర్మించారు. 65కిలోమీటర్ల ఈ కాలువ 39,500 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాల్సి ఉంది. ఇది వాంకిడి, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, సిర్‌పూర్(టీ) మండలాల మీదుగా విస్తరించి ఉంది. అనేక ఉప, పిల్ల కాలువతో సాగునీరు సరఫరా చేయాల్సి ఉండగా ఇప్పటివరకు కొన్ని పిల్ల కాలువలకు నీటి సరఫరా కూడా ప్రారంభించ లేదు. కట్టలు తెగిపోవడం, గండ్లు పడటం లాంటి అవాంతరాలు ఏర్పడిన ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రస్తుతం సాగునీరు ఒర్రెలు, వాగుల్లో కలిసిపోతున్న పరిస్థితి నెలకొంది.

**నామమాత్రంగా ఆరుతడి పంటలు**
ఎడమ కాలువ నిర్వహణ సరిగా లేక వరి, కూరగాయలు లాంటి పంటల సాగు నామమాత్రంగానే ఉంది. వర్షాధారంపై సాగుచేసే పత్తి పంటకు చలికాలం చివరలో సాగునీటి అవసరముంటుంది. రైతులు ఏటా ఈ కాలువకు ఆయిల్ ఇంజన్లు పెట్టి తడులు అందించేవారు. కానీ, కాలువ బండ్ తెగిపోగా ఈసారి ఆ పరిస్థితి లేదు. బండ్‌కు మరమ్మతు చేపట్టిన తర్వాత కూడా అధిక మొత్తంలో నీటిని విడుదల చేయడం సాధ్యం కాదు. చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించేలా అధిక మొత్తంలో నీరు విడుదల చేస్తే కాలువ మళ్లీ కోతకు గురయ్యే ప్రమాదముంది. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైనప్పటికీ వర్షాలు తగ్గు ముఖం పడితే గాని పనులు ప్రారంభించలేమని అధికారులు చెబుతున్నారు. దీంతో పత్తికి నీటి తడులు అందించడం కష్టమే. ఈ ఏడాది కురిసిన అధిక వర్షాలకు పత్తి రైతు చిత్తవుతుండగా, చివరలో నీటి తడులు అందించలేని పరిస్థితుల్లో మరింత నష్టపోయే ప్రమాదముంది.

### చిన్నవాంకిడి వద్ద తెగిన బండ్

ఇటీవల కురిసిన వర్షాలకు వచ్చిన వరదతో చిన్నవాంకిడి శివారులో ఎడమ కాలువ బండ్ తెగింది. దీంతో కాలువకు నీటి సరఫరా నిలిపివేశారు. మూడేళ్ల క్రితం వరద ధాటికి అదే ప్రాంతంలో బండ్ తెగిపోగా మరమ్మతు చేయించారు. కానీ, నాణ్యత లేమితో పనులు మూడేళ్లు నిలవలేక పోయాయి. చిర్లీ వాగు పైనుంచి కాలువ నిర్మించగా తరచూ బండ్ తెగిపోతోంది. దీనిపై ప్రాజెక్ట్ డీఈ దామోదర్‌ను వివరణ కోరగా.. బండ్ మరమ్మతుకు రూ.40 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. వర్షాలు తగ్గుముఖం పట్టాక పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. అయితే మరమ్మతులు చేపడితేనే గాని ఈ కాలువ గుండా నీరు సరఫరా చేయలేని పరిస్థితి ఉంది.

### మరమ్మతులు చేపట్టాలి



ఇటీవల కురిసిన వర్షాలకు మా గ్రామ శివారులోని ప్రధాన కాలువ తెగగా నీటి సరఫరా నిలిపేశారు. త్వరగా మరమ్మతు చేపట్టి సాగునీరు సరఫరా అయ్యేలా చూడాలి. నా పొలం పక్కనుంచే పిల్ల కాలువ ఉన్నా ఇప్పటివరకు నీరు రాలేదు. నీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటే చాలావరకు ఖర్చు తగ్గుతుంది.

– వద్దురె భూషణ్, రైతు, చిన్నవాంకిడి

### త్వరగా పనులు చేపట్టాలి



చలికాలం చివరలో పత్తి పంటకు నీటి తడులు ఇవ్వాల్సి ఉంది. ఇందుకు కాలువ నీరే ఆధారం. ప్రస్తుతం కాలువ తెగిపోయి ఉండగా సాగునీరు అందుతుందో లేదోనని ఆందోళనగా ఉంది. అధికారులు కాలువను పరిశీలించి వర్షాలు తగ్గుముఖం పట్టాక మరమ్మతులు చేపడతామన్నారు. త్వరగా పనులు చేపట్టాలి.

– వద్దురె పాపాలాల్, రైతు, చిన్నవాంకిడి

# భీం వర్ధంతికి ఏర్పాట్లు చేయాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే
- అధికారులతో సమీక్ష



కౌంటింగ్ గది పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్: కెరమెరి మండలం జోడేఘాట్‌లో ఈ నెల 7న నిర్వహించనున్న కుమురంభీం వర్ధంతికి పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే సూచించారు. శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో భీం వర్ధంతి ఏర్పాట్లపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. తాగునీరు, విద్యుత్, రవాణా, భోజన వసతి, వైద్య సౌకర్యాలు కల్పించాలని, పారిశుధ్య కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఆర్టీసీ అధికారులు జోడేఘాట్‌కు ప్రత్యేక బస్సులు నడపాలని సూచించారు. వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని, అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. రవాణా ఇబ్బందులు తలెత్తకుండా రహదారులు మరమ్మతు చేయాలని, పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు. అధికారులు సమన్వయంతో పని చేసి వర్ధంతిని విజయవంతం చేయాలని సూచించారు. డీపీవో భిక్షపతి, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి రమాదేవి, డీఎంహెచ్‌వో సీతారాం, డీఎల్పీవో ఒమర్ హుస్సేన్, ఇంజినీరింగ్, మిషన్ భగీరథ అధికారులు పాల్గొన్నారు.

**ఎన్నికల విధులు పక్కాగా నిర్వహించాలి**
పంచాయతీ ఎన్నికలు నిబంధనలకు లోబడి సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే సూచించారు. జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల కళాశాలలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల కౌంటింగ్ కోసం ఏర్పాటు చేస్తున్న స్ట్రాంగ్‌రూమ్, కౌంటింగ్ గదులను ఎస్పీ కాంతిలాల్ పాటిల్‌తో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 9నుంచి ఎంపీటీసీ, జెడ్పీటీసీ, స్థానిక ఎన్నికల ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. జిల్లాలో రెండు విడతల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నవంబర్ 11న ఓట్ల లెక్కింపు ఉన్నందున కౌంటింగ్ కేంద్రంలోని స్ట్రాంగ్‌రూమ్, కౌంటింగ్ గదుల్లో అవసరమైన ఏర్పాట్లు చేయాలని జెడ్పీ సీఈవో లక్ష్మీనారాయణను ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రాల్లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా పూర్తి స్థాయిలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ రియాజ్ అలీ, ఎంపీడీవో శ్రీనివాస్, జెడ్పీ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

**7న విద్యాసంస్థలకు సెలవు**
ఆసిఫాబాద్‌రూరల్: కుమురం భీం వర్ధంతిని పురస్కరించుకుని జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు ఈ నెల 7న సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ వెంకటేశ్ దోత్రే శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జోడేఘాట్‌లో కుమురం భీం వర్ధంతిని ఘనంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 7కు బదులు నవంబర్ 8న రెండో శనివారాన్ని పనిదినంగా పరిగణించనున్నట్లు తెలిపారు.

# బోధన.. ఆకట్టుకునేలా

- 'టీఎల్‌ఎం' తయారీలో ఉమ్మడి జిల్లా ఉపాధ్యాయులు
- ఆట పరికరాలు, బొమ్మలతో బోధన
- మండల, జిల్లాస్థాయి టీఎల్‌ఎం మేళాల్లో ప్రతిభ
- నేడు అంతర్జాతీయ టీచర్ల దినోత్సవం

టీఎల్‌ఎం మేళాలో రాష్ట్రస్థాయికి ఎంపిక

| జిల్లాలు | టీచర్లు |
|---|---|
| మంచిర్యాల | 9 |
| ఆసిఫాబాద్ | 9 |
| నిర్మల్ | 8 |
| ఆదిలాబాద్ | 7 |


టీఎల్‌ఎం ప్రదర్శనలతో ఉపాధ్యాయులు

ప్రాథమిక పాఠశాలల విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపునకు, బోధన పద్ధతులు మెరుగుపర్చుకునేలా రాష్ట్ర విద్యాశాఖ టీఎల్‌ఎం మేళా నిర్వహిస్తోంది. ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ టీచర్లు బోధనోపకరణాల ద్వారా విద్యార్థులకు సులభపద్ధతిలో బోధన చేస్తూ తమ ప్రత్యేకత చాటుకుంటున్నారు. ఆట పరికరాలు తయారీ చేసి, బొమ్మలతో ఆకట్టుకునేలా బోధన చేస్తున్నారు. మండల, జిల్లాస్థాయి మేళాల్లో గురువులు తయారీ చేసిన ప్రాజెక్టులు, ప్రదర్శనలతో ప్రతిభ కనబర్చారు. ఇటీవల ఉత్తమ టీఎల్‌ఎం ప్రదర్శించిన పలువురు టీచర్లు రాష్ట్ర స్థాయికి ఎంపికకాగా, ఆదివారం అంతర్జాతీయ టీచర్ల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

– లక్ష్మణచాంద/మంచిర్యాలఅర్బన్/ఆదిలాబాద్‌టౌన్/ఆసిఫాబాద్ రూరల్

## ఆడుతూ పాడుతూ నేర్చుకుంటారు



విద్యార్థులు గణితం సులభంగా నేర్చుకోవడానికి నేను తయారు చేసిన టీఎల్‌ఎం ఎంతగానో ఉపయోగపడుతుంది. అట్ట ముక్కలు, పేపర్, పనికిరాని వస్తువులతో చతుర్విధ ప్రక్రియలు, ఆకారాలు, నమూనాలు, చిన్న, పెద్ద అంకెలు తయారు చేశాను. 1 నుంచి 6వ తరగతి విద్యార్థులకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయి. ఆడుతూ పాడుతూ వారు గణితం నేర్చుకుంటారు.

– కె.సంతోష్ కుమార్, ఎంపీపీఎస్ తేజాపూర్

## టీచర్ల కొరత ఉన్నప్పుడు..



నేను తయారు చేసిన టీఎల్‌ఎం ఒకరు.. ఇద్దరు టీచర్లు పనిచేసే చోట ఎంతగానో ఉపయోగపడపతుంది. పరిసరాల విజ్ఞానానికి సంబంధించి పుస్తకాన్ని చూడకుండానే 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు ఒకేచోట కూర్చోబెట్టి బోధన చేయవచ్చు. జ్ఞానేంద్రియాలు, కుటుంబం, వాహనాలు, మనబడి వస్తువులు, మొక్కలు, కూరగాయలు, జంతువులు, పక్షులు, వాటి ద్వారా కలిగే ప్రయోజనాలు సులభంగా తెలుసుకోవచ్చు. పది అంశాలకు సంబంధించి తయారు చేయడంతో రాష్ట్రస్థాయికి ప్రాజెక్ట్ ఎంపికైంది.

– సునీత, ఎంపీపీఎస్ రాంపూర్

## కథల ద్వారా బోధన..



ఇంగ్లిష్ భాషను విద్యార్థులు సులభంగా అర్థం చేసుకోవడం, చదవడానికి వీలుగా టీఎల్‌ఎం తయారు చేశాను. పలు పాఠాలను నా వాయిస్ ద్వారా రికార్డు చేశాను. ఒక డివైస్‌తో విద్యార్థులకు వినిపించేలా తయారు చేశాను. ఈ కథలకు సంబంధించిన బొమ్మలు, కథానుసారంగా ప్రదర్శన ఉండడంతో సులువుగా అర్థం చేసుకుంటారు. ఒకటికి పదిసార్లు వినడంతో కఠిన పదాలు మదిలో గుర్తుండిపోతాయి. నారేటివ్ బేస్డ్ ఇంగ్లిష్ అనే అంశంపై ప్రదర్శించాను.

– ఎ.శ్రీనివాస్, ఎంపీపీఎస్ గోండుగూడ, ఉట్నూర్

## సులభంగా బోధిస్తున్నాను



వాడి పాడేసిన వస్తువులు, ఆకులు, సీతాఫలం గింజలు, అట్ట ముక్కలు, డ్రాయింగ్ షీట్స్, ఇసుక రాళ్లు, డబ్బామూతలు, గడ్డితో బోధనోపకరణాలు తయారీ చేసి విద్యార్థులకు బోధన చేస్తున్నాను. తెలుగు అక్షరాలు, వర్ణమాల, సరళ పదాలు క్లాత్‌పై రాసి వాటిని కుట్టి విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా బోధిస్తున్నాను. జిల్లాస్థాయిలో టీఎల్‌ఎం మేళాలో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాను.

– రమేశ్‌బాబు, హెచ్‌ఎం, ప్రాథమిక పాఠశాల కడ్తాల్, సోన్ మండలం

## ఆకర్షణగా మ్యాజిక్ మ్యాథ్స్



మ్యాజిక్ మ్యాథ్స్ వినూత్న బోధన పద్ధతి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. బోధనోపకరణం ద్వారా కూడిక, తీసివేత, గుణకారం, భాగాహారం వంటి చతుర్విధ ప్రక్రియలను సులభంగా నేర్చుకోవచ్చు. విద్యార్థులకు ఆరోహణ, అవరోహణ సంఖ్య, సరి,బేసి సంఖ్య గుర్తింపు, క్రమపద్ధతిలో అంకెలు సులువుగా నేర్చుకునేలా రూపొందించాను. 'మ్యాజిక్ మ్యాథ్స్'ద్వారా గణితం అంటే విద్యార్థుల్లో భయం పోయి ఆసక్తి పెరుగుతుంది.– ఎల్లన్న, ప్రాథమిక పాఠశాల, వానల్‌పాడ్, భైంసా

## ఆంగ్లంలో కాన్సెప్ట్ మ్యాపింగ్



ఆంగ్లంపై కాన్సెప్ట్ మ్యాపింగ్ తయారీ చేసిన బోధనోపకరణం ప్రత్యేకంగా ఉంది. దీని ద్వారా 1 నుంచి 5వ తరగతి వరకు అన్ని పాఠ్యాంశాలకు ఉపయోగపడేలా రూపొందించాను. విద్యార్థులకు సులభంగా ఆంగ్లం నేర్చుకునేలా దాన్ని తయారీ చేశాను. మండల, జిల్లా స్థాయి మేళాలో ప్రతిభ కనబర్చాను.

– శ్వేత, ఎస్జీటీ, ప్రాథమిక పాఠశాల పీచర

## ఏఐ లెర్నింగ్ మెషీన్




అన్ని తరగతుల విద్యార్థులకు విషయాలు సులభంగా అర్థమయ్యేలా ఏఐ మెషీన్ తయారు చేశాను. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లెర్నింగ్ ద్వారా సులభంగా నేర్చుకుంటారు. ఉపాధ్యాయులకు బోధనలో ఇది ఉపయోగకరంగా ఉంటుంది. బోధనోపకరణంలో రెండు విభాగాలు ఓ వైపు ప్రశ్న భాగం, మరో వైపు సమాధానం. ఎప్పుడైతే సరైన సమాధానం ఎంపిక చేస్తారో అప్పుడు మాత్రమే బల్బు వెలుగుతుంది.

– వెంకటరాజం, ప్రాథమిక పాఠశాల పెర్కపల్లి, దస్తురాబాద్ మండలం

## అర్థమయ్యేలా నమూనాలు



ఉర్దూ, గణితం, సైన్స్ తదితర విషయాలు, అవగాహన, ఆసక్తి పెంచేలా విద్యార్థుల కోసం నమూనాలు రూపొందించాను. బోధనోపకరణాల ద్వారా అన్ని విషయాలు సులువుగా అర్థమయ్యేలా తయారు చేశాను. వీటి ద్వారా వారికి ఆసక్తి పెరుగుతుంది.– మోబిన్ అహ్మద్, ఉర్దూ ప్రాథమిక పాఠశాల ఓవైసినగర్, భైంసా

## పదాలు సులువుగా నేర్చుకునేలా..



పార్ట్స్ ఆఫ్ స్పీచ్ అండ్ వోకాబులరీ కిట్ రూపొందించాను. పిల్లలకు చిత్రం (గ్రాఫిక్) చూపెట్టి పదం, వ్యాకం పరిచయం (పదాల అభివృద్ధి) చేయడం. ఇంగ్లిష్ గ్రామర్ అంటే పిల్లల్లో భయం తొలగించడం.. సులువుగా నేర్చుకునేలా కిట్ తయారు చేశాను. పదాలు నేర్చుకోవడం ప్రతీ విద్యార్థి విద్యాభివృద్ధిలో ముఖ్యమైన భాగం. పదాలను గుర్తించి వాక్యాన్ని సులువుగా నిర్మిస్తారు. ఆంగ్ల అక్షరపదాలు అలవోకగా పలికేలా భాషా సామర్థ్యాన్ని పెంపొందించవచ్చు.

– శశికుమార్, సుర్జాపూర్, కన్నెపల్లి మండలం

## ఆటపాటలతో లెక్కలు నేర్చుకోవడం



పాఠశాలల విద్యార్థులు లెక్కలంటే తికమక పడుతుంటారు. భయం లేకుండా సులువుగా నేర్చుకునేలా గణిత సామగ్రి కిట్ రూపొందించాను. విద్యార్థులు సంఖ్యలు, స్థాన విలువలు, ఆరోహణ, అవరోహణ క్రమం, చతుర్విధ ప్రక్రియలు, కొలతలు, సమయం, క్యాలెండర్, భిన్నాలు, కోణాలు తదితర సులభంగా ప్రత్యక్షంగా చేతితో నేర్చుకుంటారు.

– ఈర్ల శోభ, ఎంపీపీఎస్ దుగ్నెపల్లి (హెచ్‌డబ్ల్యూ)

## పుస్తకం చూడకుండానే..



విద్యార్థులకు పుస్తకం చూడకుండానే పరిసర విజ్ఞానంపై పట్టు సాధించేలా టీఎల్‌ఎం తయారు చేశాను. 1 నుంచి 6వ తరగతి వరకు విద్యార్థులకు ఎంతగానో దోహదపడుతుంది. గ్రహాలు, కక్షలు, సూర్యుడు, భూమి, అంతరిక్షంపై అక్షంక్షాలు, రేఖాంశాలు, ప్రపంచాన్ని కళ్ల ముందు చూపించేలా ఆకారాలు తయారు చేశాను. తరగతి గదిలో విశ్వం కనిపించేలా రూపొందించాను. తక్కువ ఖర్చుతోనే విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో తయారు చేశాను.

– సీహెచ్.నరేశ్, ఎంపీపీఎస్ రాంపూర్‌గూడ

## పద నిర్మాణంతో తెలుగు బోధన




విద్యార్థులకు వైకుంఠపాళి పోలిన ఆటబొమ్మల ద్వారా తెలుగు బోధన చేస్తున్నాను. బొమ్మల ఆధారంగా పద నిర్మాణం చేయిస్తున్నా. గుణాంత, ఒత్తు పదాలు, ఒకే టీఎల్‌ఎంలో వచ్చేలా తయారీ చేసి బొమ్మ కింద ఒక అక్షరం ఇచ్చి మిగతా అక్షరాలు రాయిస్తున్నాను. రాని వారికి ప్రత్యేకంగా హెల్ప్ లైన్ ఏర్పాటు చేసి బొమ్మ పేరు కార్డు వెనుక రాసి ఉంటుంది. దాని చూసి నేర్చుకునేలా పద నిర్మాణం చేయిస్తున్నాను.

– నరేశ్‌కుమార్ తెలుగు, వాంకిడిలోని భీంగూడ పాఠశాల

## ఇంగ్లిష్ నేర్చుకోవడం సులభతరం



1 నుంచి ఐదో తరగతి విద్యార్థుల కోసం రూపొందించిన ప్రత్యేక ఇంగ్లిష్ నేర్చుకునే సాధనం (కిట్). స్పిన్ వీల్, థిమాటిక్ బోర్డ్ గేమ్ కలిపి విద్యార్థులు ఆట వాతావరణంలో క్రియాశీలంగా పాల్గొని భాషా నైపుణ్యాలు అభివృద్ధి చేసుకోవడానికి అవకాశం కల్పిస్తోంది. స్పిన్ వీల్‌లో ప్రతి సెగ్మెంట్ రెండు అంశాలను చూపిస్తుంది. ఒకటి విద్యార్థులు పూర్తి చేయాల్సిన సవాల్, రెండోవది బోర్డులో ముందుకు కదలాల్సిన దశల సంఖ్య, సవాళ్లు వేరే వేరే రకాలుగా ఉంటాయి. సంప్రదాయ పాఠ్య పద్ధతిని మించి ఒక హ్యాండ్స్ అన్ డైనమిక్ సరదా, నైపుణ్యాధారిత పాఠశాల అనుభవాన్ని విద్యార్థులకు అందిస్తోంది.

– ఎం.కిరణ్‌కుమార్, మంచిర్యాల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

## బొమ్మల ద్వారా నేర్చుకుందాం



పుస్తకం అవసరం లేకుండా ఆకర్షణీయ బొమ్మలతో పదాలు నేర్చుకోవడం.. పిల్లల దృష్టిని పాఠ్యాంశం వైపు మరల్చి ఆటపాటలతో బోధించడం ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం. పుస్తకంతో కుస్తీ పట్టకుండా బొమ్మలతో పదాలు అక్షరాలు రూపొందించాను. వర్ణమాల, దీర్ఘాలు, వత్తులు, గుణింతాలు నేర్చుకోవడం సులభతరంగా ఉంటుంది. ఆటపాటలతో బోధించటం వల్ల విద్యార్థుల్లో ఆసక్తి పెరుగుతుంది. – స్వర్ణలత, ఎంపీయూపీఎస్, అక్కెపల్లి, చెన్నూర్ మండలం

## తెలుగుపై పట్టు సాధించేలా..



విద్యార్థులు సరళంగా తెలుగు భాష నేర్చుకోవడం, అక్షరదోషాలు లేకుండా రాయడం, పలకడం కోసం నేను టీఎల్‌ఎం తయారు చేశాను. టెలిఫోన్ ద్వారా పదాలు గుర్తించడం, పలకడం, క్యారం బోర్డు ద్వారా కొత్త అక్షరాల గుర్తింపు, టీకప్పుల ద్వారా అక్షర మాల, ఇతర వ్యర్థాలతో తయారు చేసిన వస్తువులతో గుర్తుంచుకునేలా సరళ పదాలు, ద్విత్వ అక్షరాలు, సంయుక్త అక్షరాలు, ఒత్తులు, దీర్ఘాలు, తదితర పొందుపర్చాను. పిల్లలు సంతోషంగా ఆటలాడుతూ వీటిని నేర్చుకుంటున్నారు. తరగతి గదిలో వీటి ద్వారా విద్యాబోధన చేస్తున్నాను.

– కవిత, ఎంపీపీఎస్ మావల-2

## బొమ్మలు చూసి చెప్పిస్తూ..



గిరిజన గ్రామంలో విద్యార్థులకు సరిగ్గా తెలుగు భాష రాదు. ఆంగ్లం నేర్పించేందుకు బొమ్మల ద్వారా ఏ టూ జెడ్ అక్షరాల పదాలు వారితో చెప్పిస్తున్నాను. 1, 2వ తరగతి పిల్లలకు అక్షరం పక్కనే బొమ్మల మోడల్స్ తయారు చేసి విన్నూత పద్ధతిలో నేర్పిస్తున్నాను. బొమ్మలకు ఆకర్షితులవుతూ ఆసక్తిగా నేర్చుకుంటున్నారు.

– వంశీకృష్ణ తిర్యాణిలోని ఉల్లిపిట్ట పాఠశాల

## గోళీల గిన్నెలతో గణితం సులువు



విద్యార్థులకు గోళీల గిన్నెలను తీసుకుని భాగహారాలు, గుణకార లెక్కలు నేర్పిస్తున్నారు. గిన్నెలలో ఇచ్చిన అంకెలు, సంఖ్యలకు అనుగుణంగా పంచుతూ స్వయంగా నేర్చుకునేలా బోధిస్తున్నారు. విద్యార్థులు గణితాన్ని సులువుగా నేర్చుకుంటున్నారు.

– రవి తిర్యాణిలో ఘఖీరావు పేట్ పాఠశాల

## పటంలో రాష్ట్రాలు గుర్తించేలా..



భారతదేశంలో 29 రాష్ట్రాలు, 8 కేంద్ర పాలిత ప్రాంతాలు గుర్తించేలా దేశ మ్యాప్‌ను అందుబాటులో ఉంచింది. భారతదేశ పటంలో లైట్లు అమర్చారు. పాఠశాల విద్యార్థులు అన్ని రాష్ట్రాలు రాసి ఉన్న దానిపై టచ్ చేస్తే లైట్లు వెలుగుతుంది. దిక్కులు, మూలలు, రాష్ట్రాలు, రాజధానులు, ఉత్తర, దక్షిణ, తూర్పు, ఈశాన్య ఉన్న వాటిని సులువుగా గుర్తిస్తారు.

– వెంకటేశ్, సిర్పూర్ (టి)లోని లక్ష్మీపూర్ పాఠశాల



## రేషన్ బియ్యం తరలిస్తున్న ఇద్దరి అరెస్టు


స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

ఆదిలాబాద్‌టౌన్: రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. శనివారం వన్‌టౌన్‌లో ఈ మేరకు వివరాలు వెల్లడించారు. పట్టణంలోని ఖిల్లాకు చెందిన షేక్ ఫైసల్, చిల్కూరిలక్ష్మీనగర్‌కు చెందిన అబ్దుల్ సత్తార్‌లు బొక్కల్‌గూడలో అక్రమంగా బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. పోలీసులకు అందిన సమాచారంతో దాడి చేసి వారి నుంచి 3.2 క్వింటాళ్ల బియ్యంతోపాటు స్కూటీని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. వీరిద్దరిని కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

## డివైడర్‌ను ఢీకొన్న కారు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని తెలంగాణ చౌక్ నుంచి బస్టాండ్ వైపు వెళ్లే కారు శుక్రవారం రాత్రి అతివేగంగా డివైడర్‌ను ఢీకొట్టింది. ఈఘటనలో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. కారు ముందు భాగంగా నుజ్జునుజ్జయింది. ఈమేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

## అంబేడ్కర్ ఫ్లెక్సీని అవమానించిన ఒకరిపై కేసు

భైంసాటౌన్: అంబేడ్కర్ చిత్రపటం ఉన్న ఫ్లెక్సీని అవమానించిన ఒకరిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ జి.గోపినాథ్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. పట్టణంలోని గోపాల్‌నగర్‌కు చెందిన దేవిదాస్‌కు చెందిన యూత్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి దుర్గామాత విగ్రహ నిమజ్జన ర్యాలీ సందర్భంగా అదేకాలనీకి చెందిన బుద్ధరతన్.. అంబేడ్కర్ చిత్రపటం ఉన్న ఫ్లెక్సీతో వీరి బృందంలో చేరి నృత్యం చేశాడు. దీంతో ఆగ్రహించిన దేవిదాస్ అతని చేతిలో ఫ్లెక్సీని లాక్కుని చించివేశాడు. శనివారం విషయం తెలుసుకున్న దళిత యువకులు అధిక సంఖ్యలో దేవిదాస్ ఇంటికి చేరుకుని అతన్ని బస్టాండ్ వద్ద గల అంబేడ్కర్ విగ్రహం వద్దకు తీసుకువచ్చారు. అంబేడ్కర్ విగ్రహానికి క్షమాపణలు చెప్పించారు. అనంతరం బుద్ధరతన్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

## పాఠశాలలో వరుస చోరీలపై ఫిర్యాదు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాకేంద్రంలోని జన్కాపూర్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న వరుస చోరీలపై హెచ్‌ఎం ఉదయ్‌బాబు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పాఠశాలలో గతనెల 16 నుంచి ఈనెల 3వ తేదీ వరకు మూడుసార్లు గుర్తుతెలియని వ్యక్తులు చొరబడ్డారు. హెచ్‌ఎం రూం, ల్యాబ్‌లో వస్తువులను ఎత్తుకెళ్లారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

# అంబులెన్స్‌లో ప్రసవం


కవల పిల్లలు, తల్లితో అంబులెన్స్ సిబ్బంది

జన్నారం: మండలంలోని కిష్టాపూర్‌కు చెందిన లత అనే గర్భిణి అంబులెన్స్‌లో ఆసుపత్రికి తీసుకువస్తుండగా మార్గమధ్యలో ప్రసవించింది. శనివారం ఉదయం ఆమెకు పురిటినొప్పులు రావడంతో కుటుంబీకులు అంబులెన్స్ సిబ్బందికి సమాచారమిచ్చారు. వారు అక్కడికి చేరుకుని ఆస్పత్రికి తీసుకువెళ్తుండగా ఆమెకు పురిటినొప్పులు అధికమయ్యాయి. ఈక్రమంలో పురుడుపోయగా ఇద్దరు కవల ఆడపిల్లలకు జన్మనిచ్చింది. ఒక పాప ఏడవకపోవడంతో ఎస్ఎన్ఆర్ చేయగా ఏడ్చినట్లు ఈఎంటీ జాడి రమేశ్ తెలిపారు. తల్లీబిడ్డలను జగిత్యాల ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

# దాడి కేసులో ఏడుగురి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై గంగారం

కాసిపేట: ఒకరిపై దాడి చేసిన కేసులో ఏడుగురిని శనివారం అరెస్టు చేసినట్లు దేవాపూర్ ఎస్సై గంగారాం తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో ఈమేరకు వివరాలు వెల్లడించారు. మండలంలోని కొండాపూర్ సబ్‌స్టేషన్ సమీపంలో వైన్ షాప్ వద్ద ఈనెల 3న అచ్యుతరావ్ గూడెంకు చెందిన గూడెం రాంచందర్ ఉన్నాడు. దేవాపూర్‌కు చెందిన బోర్లకుంట ప్రణయ్, రాంటెంకి చంద్రయ్య, చునార్కర్ రాజేష్, కోమటిచేనుకు చెందిన జాడి కిరణ్, దుర్గం శేఖర్, బోర్లకుంట ప్రవీణ్, జాడి సాగర్ అకారణంగా దాడి చేశారు. రాంచందర్‌ను దుర్భాషలాడుతూ చేతులు కాళ్లతో తన్ని బీరు బాటిల్‌తో కొట్టి గాయపర్చారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి ఏడుగురిని అరెస్టు చేశారు. గతంలో నేరచరిత్ర ఉన్న బోర్లకుంట ప్రణయ్‌పై రౌడీషీట్ తెరవనున్నట్లు ఎస్సై తెలిపారు.

## మోసగించిన ముగ్గురిపై కేసు


వెల్లడిస్తున్న టూటౌన్ సీఐ నాగరాజు

ఆదిలాబాద్‌టౌన్: మల్టీ మార్కెట్ పేరిట నకిలీ ఔషధాలు అంటగడుతూ మోసం చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ నాగరాజు తెలిపారు. శనివారం టూటౌన్‌లో ఈ మేరకు వివరాలు వెల్లడించారు. సింగాపూర్, పంజాబ్, తదితర ప్రాంతాల నుంచి ఆరోగ్యానికి సంబంధించిన ఔషధాలు తీసుకొచ్చామని చెబుతున్నారని, ప్యాకెట్లను జిల్లాలో విక్రయిస్తున్నారు. అన్నిరకాల రోగాలు నయమవుతాయని ప్రజలను నమ్మ బలుకుతున్నారు. ఆదిలాబాద్‌లో నకిలీ ఔషధ ప్యాకెట్లు విక్రయిస్తున్న ఇద్దరిని అదుపులో తీసుకుని విచారిస్తే ఇది వెలుగులోకి వచ్చింది. జిల్లా కేంద్రంలోని బృందావన్ కాలనీలో ఉంటున్న నార్నూర్‌కు చెందిన మహేందర్, తాంసి మండలం బండల్‌నాగాపూర్‌కు చెందిన రాకేశ్ విక్రయిస్తున్నారని, ఈ ఇద్దరు ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన ముకుంద్‌రావు వద్ద కొనుగోలు చేశారు. 6 ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామని, ఒక్కో ప్యాకెట్‌ను రూ.5,800 వరకు, మరికొంత మందికి ఇష్టమున్న ధరలకు విక్రయిస్తున్నారు. ఈ ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

# సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్‌టౌన్: సైబర్ నేరాలపై జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ అఖిల్ మహాజన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత వారం జిల్లా పోలీసు సైబర్ కార్యాలయానికి 15 ఫిర్యాదులు అందాయని, సోషల్ మీడియాలో ఆఫర్ల పేరిట తక్కువ రేటుకు దుస్తులు అందజేస్తామని జరిగే మోసాలపై అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. సైబర్ నేరాలు జరిగిన వెంటనే 1930కు, సైబర్ క్రైమ్ వెబ్ సైట్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. ప్రతీ వారం జిల్లా సైబర్‌క్రైమ్ బృందంతో గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో సైబర్ వారియర్ ఏర్పాటు చేసి సైబర్ నేరాలపై విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

**జిల్లాలో నమోదైన కేసుల వివరాలు..**

రూ.5 నోటుకు 5 పైసల నాణేనికి రూ.99 లక్షలు ఇస్తామని నమ్మబలికి తలమడుగు మండలంలోని ఓ వ్యక్తి వద్ద నుంచి దాదాపు రూ.8వేలు దోచుకున్నారు. ఇన్‌స్టాగామ్‌లో దసరా ఆఫర్ పేరిట తక్కువ రేటుకే ఎక్కువ దుస్తులు ఇస్తున్నామని మావల మండలానికి చెందిన బాధితురాలి వద్ద నుంచి రూ.6200 తిరస్కరించారు. తక్కువ వడ్డీ రేటుకు లోన్ ఇస్తామంటూ టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బాధితుడిని మోసం చేయగా, బాధితుడు విడతల వారీగా సైబర్ నేరగాళ్లకు దాదాపు రూ.14వేలు చెల్లించాడు. ఇచ్చోడ నుంచి ట్రాన్స్‌పోర్ట్ కావాలని ఆన్‌లైన్‌లో వెతకగా నకిలీ కస్టమర్‌కేర్ వ్యక్తులు బాధితుడిని సంప్రదించి రూ.26వేలు తస్కరించారు. కేరళ లాటరీ రూ.5 లక్షలు వచ్చిందని, ఈ డబ్బులు ఇవ్వాలంటే ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలని ఆదిలాబాద్‌రూరల్ మండలానికి చెందిన ఓ వ్యక్తి వద్ద నుంచి దాదాపు రూ.23,500 దోచుకున్నారు.

## జ్వరంతో ఇంటర్ విద్యార్థి మృతి


మహేశ్ (ఫైల్)

నార్నూర్: గాదిగూడ మండలం ధాబా(కే) గ్రామంలో జ్వరంతో ఇంటర్ విద్యార్థి మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన మెస్రం యెసు, దుర్గుబాయి దంపతుల కుమారుడు మహేశ్ (16) ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఏపీఆర్‌జేసీలో ఇంటర్ చదువుతున్నాడు. దసరా సెలవుల్లో పదిరోజుల క్రితం ఇంటికి వచ్చినప్పటి నుంచి జ్వరంతో బాధపడుతున్నాడు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులకు తీసుకెళ్లిన జ్వరం తగ్గలేదు. శనివారం ఇంట్లోనే జ్వరంతో బాధపడుతూ మృతిచెందాడు. బాధిత కుటుంబానికి కళాశాల తరఫున సహాయం చేయాలని ఆదివాసీ గోండ్వాన సమితి తరఫున మెస్రం శేఖర్‌బాబు కోరారు.

## చికిత్సపొందుతూ ఒకరి మృతి

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని క్రాంతినగర్‌కు చెందిన ఎర్రం హన్మాండ్లు (54) హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు టూటౌన్ సీఐ నాగరాజు తెలిపారు. పట్టణంలోని జీఎస్ ఎస్టేట్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న హన్మాండ్లు గతకొన్ని రోజులుగా మద్యానికి బానిసయ్యాడు. దీంతో ఆయన భార్య మందలించడంతో మనస్తాపం చెంది ఈనెల 3న ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు ఆదిలాబాద్ రిమ్స్‌కు, అక్కడి నుంచి హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించగా శనివారం చికిత్సపొందుతూ మృతిచెందారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ తెలిపారు.

## వివాహిత అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని బంగారుగూడకు చెందిన వివాహిత షేక్ నిలోఫర్ అదృశ్యమైనట్లు వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు.. శనివారం ఉదయం 13 ఏళ్ల కుమారుడు షేక్ అయాన్‌తో బ్యాంక్ పని నిమిత్తం పట్టణంలోని శివాజీచౌక్‌కు వెళ్లింది. చెప్పు తెగిపోవడంతో వినాయక్ చౌక్ వద్ద ఉంటానని కుమారుడికి తెలిపింది. అక్కడికి వెళ్లగా తల్లి కనిపించకపోవడంతో తండ్రి షేక్ అలీకి చెప్పాడు. పలు ప్రాంతాల్లో గాలించిన ఆచూకీ దొరకలేదు. భర్త ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ తెలిపారు.